
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 20 మే 2023
5
తిరుపతి





గూడూరులో..

పేదల పెన్నిధి సుందరయ్య..!



తిరుపతిలోని బిటిఆర్ కాలనీలో..



బాలాయపల్లిలో..



కెవిబిపురంలో..



నాయుడుపేటలో..



నాగలాపురంలో..

జిల్లావ్యాప్తంగా ఘనంగా నివాళి పోరాట స్ఫూర్తి నింపిన 'రక్తదానం'


ప్రజాశక్తి - గూడూరు, యంత్రాంగం

'పేదల పెన్నిధి సుందరయ్య' అంటూ జిల్లావ్యాప్తంగా సిపిఎం శ్రేణులు ఘనంగా నివాళి అర్పించాయి.. 'సుందరయ్య బాటలో నడుద్దాం' అంటూ ప్రతినబూనారు.. ఆదర్శమూర్తికి అరుణాంజలి ఘటించారు.. గూడూరులో యువత రక్తదానం చేసి పోరాట స్ఫూర్తిని పటిష్టం చేశారు.. వాడవాడలా మజ్జిగ కేంద్రాలు పెట్టి కూలీలకు, కార్మికులకు అందించారు.. 'చల్లనయ్యా.. మా సుందరయ్యా.. పేదల పాలిట పెన్నిధయ్యా' అంటూ ఆయన జీవిత చరిత్రను మననం చేసుకున్నారు.

గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని చెన్నూరు గ్రామంలో శుక్రవారం సిపిఎం చెన్నూరు కమిటీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్థంతి సందర్భంగా 'రక్తదానం చేద్దాం.. ప్రజల ప్రాణాలు కాపాడుకుందాం' అనే నినాద స్ఫూర్తితో భారీ ఎత్తున రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో పుట్టిన సుందరయ్య తుదివరకూ పేదల పాలిట నిలిచి మంచి కమ్యూనిస్టుగా ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. ప్రజా నాయకుడుగా, పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడిగా పోరాడి దక్షిణ భారతదేశ ఉద్యమ నిర్మాతగా పార్టీని నిర్మించారన్నారు. నిర్బంధాలను తట్టుకుని నిలబడ్డారన్నారు. రక్తదాన శిబిరంలో 17 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి కూలీలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం రమణయ్య, జోగి శివకుమార్, రాయవరపు శ్రీనివాసులు, కె.శ్రీనివాసులు, ఎస్‌కె అరుణ్‌బాష, గడ్డం వెంకటేశ్వర్లు, డాక్టర్ సందీప్ శ్రీనివాస్, బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది సిహెచ్ బాబురావు, ఎస్‌కె మౌలాలి, స్టాఫ్ నర్సు అనితరెడ్డి, దిలీప్, ఆదిశేషయ్య పాల్గొన్నారు. గూడూరులో మార్కెట్ సెంటర్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో టవర్‌క్లాక్ సెంటర్, వాటర్ ట్యాంక్ సెంటర్, జక్కా వెంకయ్య నగర్, పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలలో మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

తిరుపతి సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి నివాళి అర్పించారు. పీడిత ప్రజల పక్షపాతి సుందరయ్య అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, టి.సుబ్రమణ్యం, జయంతి, బుజ్జి, చిన్నా, బాలాజీ, మల్లికార్జునరావు, శ్రీనివాసులు, ఎన్‌డి శ్రీనివాసులు, వివిఎస్ మణ్యం, రాధాక్రిష్ణ పాల్గొన్నారు. సుందరయ్యనగర్ కమిటీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాలు వద్ద జెండా ఎగురవేసి నివాళి అర్పించారు. నాయకులు పి.సాయిలక్ష్మి, ఎం.నరేంద్ర పాల్గొన్నారు. తిరుచానూరులో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సిపిఎం జెండా ఎగురవేసి సుందరయ్య అమర్‌రహే అంటూ నినాదాలతో హోరెత్తించారు. డివైఎఫ్ఐ జిల్లా నాయకులు జయచంద్ర, మాజీ ఎంపిటిసి సుమన్ పాల్గొన్నారు.

రేణిగుంటలో నాయకులు ఒ.వెంకటరమణ, నర్సింహారెడ్డి, శివానందం, సత్యశ్రీ, శ్యామ్, రాంరెడ్డి ఆధ్వర్యంలో మూడు ప్రాంతాల్లో నివాళి అర్పించారు. కెవిబిపురంలో మండల కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో రాజులకండ్రిగ ఎస్టీ కాలనీలో జరిగింది. నైజాం ప్రభువును ఎదిరించి పది లక్షల ఎకరాల భూములను పంచిన చరిత్ర సుందరయ్యదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురగేష్, బుజ్జమ్మ, శంకరయ్య పాల్గొన్నారు. ఓజిలిలో నాయకులు శివకవి ముకుందా, చాపల వెంకటేశ్వర్లు, ప్రజాశక్తి సంయుక్త ఆధ్వర్యంలో నిరుపేదలకు మజ్జిగ పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికురాలు కె.విజయమ్మ, వజ్రమ్మ, ఐద్వా కన్వీనర్ చంద్రకళ, జీవీకెఎస్ జిల్లా అధ్యక్షులు బి.గోపాల్ పాల్గొన్నారు. శ్రీకాళహస్తి పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో సిపిఎం, ప్రజాశక్తి సంయుక్త ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. 'సుందరయ్య బాటలో నడుద్దాం' అని ప్రతినబూనారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, షరీఫ్, పెనగడం గురవయ్య, కుమార్, వెలివేంద్రం, రాజా, ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ సిఎస్ ప్రసాద్, బ్యూరో వళిగళం గోపి, డివిజన్ ఇన్‌ఛార్జి బి.కిషోర్ పాల్గొన్నారు. ఏర్పేడులో రైతుసంఘం నాయకులు హేమలత, రంగయ్య, వెంకటేశ్వరరావు, ధర్మారెడ్డి ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నాగలాపురంలో పేదలు సిపిఎంలో చేరినట్లు మురగేష్ తెలిపారు. దినమని అముదా, మేనక, శేఖర్, సుబ్బమ్మ, బాలాజీ పాల్గొన్నారు. బాలాయపల్లిలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ స్కూలు ప్రాంగణంలో జరిగింది. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పేదలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, ఎన్.స్వరూపరాణి, జి.రాజగోపాల్, సుమతి, పద్మ, సుజాత, పోలమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు. నాయుడుపేటలో మహేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగింది. పుత్తూరు అంబేద్కర్ సర్కిల్లో నాయకులు ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఎ.విజయ్, ఎ.శివ,కృష్ణమూర్తి, పురుషోత్తం, వెంకటేష్, హరిశ్చంద్ర, రవి, చిన్న పాల్గొన్నారు. సత్యవేడు మండలం మదనంబేడు గ్రామంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నాయకులు అరుణాచలం, రమేష్, యేసయ్య, మణికంఠ పాల్గొన్నారు.



శ్రీకాళహస్తిలో..



ఓజిలిలో..



సత్యవేడులో..



తిరుచానూరులో..



గూడూరులో రక్తదానం చేస్తున్న యువకులు



తిరుపతి సిపిఎం ఆఫీసులో..



పుత్తూరులో..



రేణిగుంటలో..



సుందరయ్య కమ్యూనిటీ హాల్ ఎదుట

వడగాల్పుల్లో 'ఉపాధి' విలవిల

నీడా..నీరూ ఎక్కడ..?

- సౌకర్యాలతో మాకు సంబంధం లేదు : పీడీ
- ఆరేళ్లుగా వేసవి అలవెన్సు ఎత్తేసిన కేంద్రం
- రెండుపూట్లా మస్టర్ వద్దంటున్న కూలీలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/తొట్టంబేడు

ఉపాధి పనులు చేసేచోట పట్టలు ఇచ్చి నీడ ఏర్పాటు చేసి, నీటి సౌకర్యంతో పాటు వేసవిలో మజ్జిగ ఇవ్వాల్సి ఉంది. ఏదైనా గాయమైతే వెంటనే ప్రథమ చికిత్స చేయడానికి మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాల్సి ఉంది. అయితే కనీస సౌకర్యాలు కల్పించాల్సిన పీడీ స్వయంగా 'పొదుపు చేసి పట్టలు, నీళ్లబాటిళ్లు, గునపాలు, తట్టలు ఏమి కావాలంటే అవి అన్నీ మీరే కొనుక్కోండి.. మాకేం సంబంధం లేదు' అని ఉచిత సలహా ఇచ్చారు. అంతేకాదు వేసవి అలవెన్స్ ఇవ్వడం లేదని 'ప్రజాశక్తి' అడగ్గా 'మాకేం సంబంధం... కేంద్రాన్ని అడగండి..' ఇంకా మాట్లాడారంటే ఉపాధి పనులే నిలిపేస్తారు అని ద్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ స్వయంగా సెలవిచ్చారు.. ఇప్పటికే మీకు అర్థమయ్యింది కదూ.. మండుటెండలో ఉపాధి పనులు ఎలా జరుగుతున్నాయో.. వడగాల్పుల మధ్య కూలీలు విలవిలలాడుతూ పొట్టకూటి కోసం పనులు తప్పనిసరి పరిస్థితుల్లో చేస్తున్నామని చెప్పడం గమనార్హం. జిల్లావ్యాప్తంగా 'ప్రజాశక్తి' స్వయంగా ఉపాధి జరిగే చోట పనులను పరిశీలించగా అందరిదీ అదే పరిస్థితి. నీడా లేదు.. నీరూ లేదు.. కనీస సౌకర్యాలేవీ లేవు.

గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఏడాదికి వంద రోజుల పని కల్పించడం ద్వారా సామాజిక, ఆహారభద్రతను పెంపొందించాలన్న గొప్ప సంకల్పం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానిది. ఆ నాడు వామపక్ష పార్టీలు చేపట్టిన ఉద్యమాల ఫలితంగా 2005లో ఈ పథకం పురుడు పోసుకుంది. అయితే ఈ పథకాన్ని క్రమంగా నీరుగార్చే ప్రయత్నాలను ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. ఉపాధి పనులు జరిగే చోట కనీసం నీడ, నీరు, ప్రథమ చికిత్సా పెట్టెలు అందుబాటులో ఉంచకపోవడం ఇందుకు నిదర్శనం. అంతేకాదు వేసవిలో ఉపాధి కూలీలకు అందాల్సిన 30 శాతం అలవెన్స్‌కూ కోత పెట్టింది కేంద్రం. పార, గడ్డ పార, తట్టా, బుట్టకూ ఎసరు పెట్టింది మోదీ ప్రభుత్వం. మండే ఎండల్లో కాలే కడుపులతో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను 'ప్రజాశక్తి' పలకరించింది.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నీడా, నీరూ కరువే...

తిరుపతి జిల్లా వ్యాప్తంగా సుమారు 2.80 లక్షలకు పైగా జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలున్నాయి. వీరిలో 50శాతం కుటుంబాలు మాత్రమే ఉపాధి పనులకు పోతున్నాయి. శ్రీకాళహస్తి ద్వామా క్లస్టర్ లో 61 వేలకు పైగా జాబ్ కార్డులు ఉన్నాయి. వీటిలో 50 వేలకు పైగా కార్డులు యాక్టీవ్ లో ఉండగా వీరిలో 40 వేలకు పైగా కుటుంబాలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుంటున్నాయి. అయితే పని ప్రదేశంలో కనీస మౌళిక వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. నీడ, నీరు, ప్రథమ చికిత్సా పెట్టెలు అందుబాటులో ఉంచడం లేదు. గడ్డ పారలు, పారలు, టార్పాలీన్ పట్టలు ఎక్కడా కానరాని పరిస్థితి. వాటిని కూలీలకు సరఫరా చేసి ఇప్పటికి ఆరేళ్లు దాటింది. ఫలితంగా ఉపాధి కూలీలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉపాధి పనులు చేయాల్సిన పరిస్థితి దాపరించింది.

ప్రాణంపైకి తెస్తోన్న రెండు పూట్ల మస్టర్

ఉపాధి హామీ పథకాన్ని సమగ్రంగా అమలు చేసేందుకు కేంద్రం ఆ పథకంలో తీసుకొస్తున్న మార్పులు అసలుకే ఎసరు తెస్తున్నాయి. సాధారణంగా ఉపాధి హామీ పనుల్లో నీటి వనరులు, భూసార, పర్యావరణ పరిరక్షణ, కరవు నివారణ, వరద నియంత్రణ, అడవులు, చెట్ల పెంపకంతో పాటు ఇతర గ్రామీణాభివృద్ధి పనులను పెద్దయెత్తున చేస్తుంటారు. ఇవన్నీ అత్యంత కష్టంతో కూడుకున్న పనులు. ఈ పరిస్థితుల్లో ఉపాధి కూలీలు రెండు పూట్ల పని చేస్తేనే హాజరు వేస్తామంటూ కేంద్రం చెప్పడం విమర్శలకు దారి తీస్తోంది. ఉదయం 10 గంటలకే ఎండలు సుర్రుమని, చేతులు, కాళ్ళు బొబ్బలెక్కుతున్నాయనీ, మళ్ళీ మధ్యాహ్నం కూడా పని చేయమంటే ప్రాణాలపైకి తెచ్చుకోవడమేనని కూలీలు వాపోతుండటం గమనార్హం.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న పిడి

బిల్లుల చెల్లింపుల్లో జాప్యం

ఉపాధి పథకానికి బడ్జెట్ కేటాయించడంలో కూలీలకు బిల్లులు చెల్లించడంలో తీవ్ర జాప్యం నెలకొంటోందన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో రెండు నెలలకోసారి బిల్లులు చెల్లిస్తున్నారని కూలీలు వాపోతున్నారు. గతంలో టీసీఎల్ ద్వారా రాష్ట్రం బిల్లులు చెల్లిస్తుండగా, ఇప్పుడు కేంద్రం జాతీయ మొబైల్ పర్యవేక్షక వ్యవస్థ (ఎన్ఎంఎంఎస్) కింద రోజువారీగా కూలీల వివరాలను నమోదు చేస్తూ ఎన్ఐసీ ద్వారా చెల్లింపులు చేస్తోంది. ఫలితంగా బిల్లుల్లో జాప్యం జరుగుతోందంటూ ఉపాధి హామీ అధికారులే చెబుతుండడం గమనార్హం. కేంద్రం గత బడ్జెట్‌తో పోలిస్తే నిధులు పెంచాల్సింది పోయి దాదాపు 13వేల కోట్లు తగ్గించడం కూలీల పట్ల ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోంది. క్యూబిక్ మీటర్ పనికి గతంలో రూ.320 వరకు చెల్లిస్తుండగా సవరించిన కొలతల్లో అది రూ.250కి చేరింది. ఫలితంగా కూలీలకు ఉపాధి గిట్టుబాటు కాని పరిస్థితి. సవరించిన జీవో ప్రకారం ఒక మనిషి ఆరు గంటలు పనిచేస్తే రోజుకు రూ.630 చెల్లించాలని చట్టం చెబుతోంది. అయితే ఉపాధి కూలీలకు రోజుకు రూ.250 లే గిట్టుబాటు అవుతోంది.

రెండు పూట్ల మస్టర్ మాకొద్దు: జగ్గయ్య, ఉపాధి కూలీ



గతంలో ఉపాధి పనులు ముగించుకుని వ్యవసాయ పనులు చేసుకునే వీలుండేది. ఇప్పుడు రెండు పూటలా పనిచేస్తేనే హాజరు వేస్తామని బెదిరిస్తున్నారు. మధ్యాహ్నంకే చేతులు బొబ్బలెక్కుతున్నాయి. కూలీ గిట్టుబాటు కావడం లేదు. మధ్యాహ్నం కూడా ఎండలో పనులు చేస్తే ఇక అంతే సంగతి.

సమ్మర్ అలవెన్స్ 40శాతం ఇవ్వాలి : బాలకృష్ణ, వ్యకాసం జిల్లా కార్యదర్శి



ఉపాధి పనులు జరిగే చోట కనీస వసతులు లేవు. ఉపాధి కూలీలంటే కేంద్రానికి సవతి ప్రేమ. బడ్జెట్‌లో నిధులకు కోత పెట్టింది. వంద రోజులు పూర్తయిన కుటుంబాలకు పనులు కల్పించడం లేదు. చేసిన వారికి బిల్లులు చెల్లించడం లేదు. సమ్మర్ అలవెన్స్ 40 శాతం ఇవ్వాలి.

పొదుపు చేసి మీరే కొనుక్కోండి : శ్రీనివాస ప్రసాద్, డ్వామా పీడీ

'ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీలే అన్నీ వాళ్ళే తెచ్చుకోవాలి. నీళ్లబాటిల్, గడ్డ పారలు, నీడ పట్టలు కావాలంటే డబ్బులు పొదుపు చేసి కొనుక్కోవాలి.' అని శుక్రవారం ఆయన తొట్టంబేడు మండలంలోని తొట్టంబేడు వరవ కాలువ వద్ద జరుగుతున్న ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ప్రశ్నించిన కూలీలతో పై విధంగా స్పందించడం విడ్డూరం. అంతేకాకుండా సమ్మర్ అలవెన్స్ లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించిన 'ప్రజాశక్తి' విలేకరిపై 'అది మాకేం సంబంధం... కేంద్రం పరిధిలోది' అని వ్యంగ్యంగా సమాధానం ఇచ్చారు. మీరు సక్రమంగా పనులు చేయకుంటే పథకాన్ని కేంద్రం రద్దు చేస్తుందంటూ పరోక్షంగా హెచ్చరించడం గమనార్హం.

వాలంటీర్లు 'సంక్షేమ' వారథులు

మంత్రి ఆర్‌కె రోజా



వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో మంత్రి ఆర్‌కె రోజా

ప్రజాశక్తి - క్యాంపస్

వాలంటీర్లు 'సంక్షేమ' వారథులు అని పర్యాటక, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. తిరుపతి జిల్లా కేంద్రంలో 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందని, వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివని అన్నారు. శుక్రవారం ఎస్వీ యూనివర్సిటీ శ్రీనివాస ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ హరిత పాల్గొన్నారు. మంత్రి రోజా మాట్లాడుతూ 2019, ఆగస్టు 15న రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వాలంటీర్ల వ్యవస్థను ప్రారంభించారన్నారు. జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని, వరుసగా మూడో ఏడాది నిర్వహిస్తున్న వాలంటీర్లకు వందనం సన్మాన కార్యక్రమ నిర్వహణ లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్నారని, వారి సేవలు వెల కట్టలేనివని అన్నారు. వాలంటీర్లు అంటే జగనన్న సైనికులు అని, కరోనా సమయంలో ప్రజలకు ఎంతో విశేష సేవలు చేశారని తెలిపారు. ఇన్ని సంక్షేమ, అభివద్ధి పథకాలను ప్రజల ముంగిటకు తీసుకెళ్తున్న వాలంటీర్లు నిజమైన సంక్షేమ సేవకులు అని అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన సూర్యుడు కంటే ముందుగా అవ్వా తాతలకు, అర్హులైన ఇతరులకు వారి ఇళ్ళ ముంగిటకు వెళ్లి పెన్షన్ అందిస్తున్నారని అన్నారు.

తిరుపతి మునిసిపల్ కమిషనర్ మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా వాలంటీర్ల ఏర్పాటుతో గ్రామ, వార్డు ప్రాంతాలలో పరిపాలన మరింత సులువు అయిందని, వాలంటీర్ల సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముందుగా వాలంటీర్లు వారు చేస్తున్న సేవల అనుభవాలను పంచుకున్నారు. సి ఎం ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం అందరూ వీక్షించారు. జిల్లాలో సేవా మిత్రకు 10,751 , సేవరత్నకు 215, సేవా వజ్ర కు 35 మొత్తం 11001 మంది వాలంటీర్లు వారు అందించిన ఉత్తమ సేవలకు గాను సత్కారాలు పొందనున్నారని, అందులో నేడు జిల్లా స్థాయిలో కొంత మందికి సేవ మిత్ర, రత్న , వజ్ర సన్మానాలు పురస్కారాలు అందచేస్తున్నామని, నియోజక వర్గ పరిధిలోని మండలాల్లో, వార్డు స్థాయిలలో పది రోజుల పాటు ఈ పురస్కార కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. సేవ వజ్రకు 30వేలు, సేవా రత్నకు 20వేలు, సేవ మిత్రకు పదివేలు నగదు బహుమతితో పాటు సర్టిఫికేట్, శాలువా ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ అడిషనల్ మున్సిపల్ కమిషనర్ సునీత, డి ఎల్ డి వో లు సుశీల దేవి, వాణి, ఆదిశేష రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: కొత్తపాళెం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఉదయం పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారం రోజులుగా ఉపాధి హామీపై ఆడిట్ జరగడంతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల వివరాలను ఏపీవో భానుప్రియను అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. వసతులు సక్రమంగా కల్పించడం లేదని కూలీలు వాపోయారు. ఎంపీడీవో త్రివిక్రమ రావు మాట్లాడుతూ మండలంలో ఏ పంచాయతీలో నైనా ఉపాధి హామీలో ఎలాంటి అవకతవకలు జరిగినా తనకు తెలియజేయాలని వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సదుపాయాలు సమకూరుస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఎస్ఆర్పీలు, సెక్రటరీలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలకు గ్లాసుల పంపిణీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఎంఈవో రవీంద్రనాథ్ జగనన్న విద్యాకానుకలో భాగంగా రాగిజావ తాగేందుకు వీలుగా గ్లాసులను పాఠశాలలకు పంపిణీ చేశారు. 3,457 గ్లాసులను అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రథయాత్రను విజయవంతం చేయండి



ప్రజాశక్తి -గూడూరు: జూన్ 24న గూడూరు పట్టణంలో 9వ జగన్నాథ రథయాత్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని.. పట్టణ ప్రజలు యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని నెల్లూరు ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షులు శుక్ర దేవ స్వామి పేర్కొన్నారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని సొసైటీ సెంటర్ ఇస్కాన్ ప్రచార కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జూన్ 24వ తేదీ స్థానిక నారాయణమ్మ గుడి ప్రాంతం నుంచి ఈ రథయాత్ర ప్రారంభం అవుతుందన్నారు. ఈ సందర్భంగా కీర్తనలు, భజనలు, జగన్నాథ బాల దేవ సుభద్ర లు ఆగమనం, 56 వంటకాల భోగు నివేదన, ఇస్కాన్ స్వాముల సందేశాలు, ప్రసాద వితరణ మధ్య ఈ రథయాత్ర ప్రారంభం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో గూడూరు ఇస్కాన్ ప్రచార కేంద్ర ఇన్‌ఛార్జి బలభద్ర గోపదాస్, యోగ మాస్టర్ కట్ట మురళీకష్ణ, కట్ట రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించేందుకే శిక్షణ తరగతులు



ప్రజాశక్తి-గూడూరు: గూడూరు వేసవి సెలవులలో విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవి శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడుతాయని ఉమ్మడి నెల్లూరు జిల్లా గ్రంథాలయాల సంస్థ ఛైర్మన్ దుంతు శారద పేర్కొన్నారు .శుక్రవారం గూడూరు పట్టణంలోని సివిసి పార్కులో ఉన్న గ్రంథాలయాన్ని ఆమె పరిశీలించారు. రికార్డు అసిస్టెంట్ వేణు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో లైబ్రరీ వెలుగులేటి నాగేంద్రరావు చిరంజీవి, ప్రసాదు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాశక్తి-కోట: కోట పంచాయతీ పరిధిలో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కోట పంచాయతీ ఎదురుగా దాదారాయి గుంట వద్ద నూతనంగా భూగర్భ డ్రైనేజీ కాలువ నిర్మాణం కోసం గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఎంపీడీవో భవాని, నల్లపరెడ్డివినోద్ కుమార్ రెడ్డి, కాంట్రాక్టర్ దువ్వూరు రఘురామ్ రెడ్డి, వాకాడు సీఐ హరికష్ణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వాలంటీర్లకు అవార్డులు



ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండల పరిధిలోని పోలిరెడ్డిపాలెం సచివాలయంలో వాలంటీర్లుగా పనిచేస్తున్న నాగమంతల రమేష్, పేరంశెట్టి సాయిసుధలకు శుక్రవారం తిరుపతిలో జరిగిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో మంత్రి రోజా, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా సేవ, వజ్ర బహుమతులు అందుకున్నారు. రూ.30 వేలు నగదు, ప్రశంసాపత్రం అందుకోవడంతో ఎంపీడీవో సింగయ్య, సచివాలయం సిబ్బంది అభినందనలు తెలిపారు.

జీవవైవిధ్య అవార్డు గ్రహీతకు సత్కారం



ప్రజాశక్తి-క్యాంపస్: రాష్ట్ర జీవ వైవిధ్యమండలి ఈనెల 22న నిర్వహించే అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, కమ్మకండ్రిగలో జీవ శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న నీలకంఠయ్యకు జీవవైవిధ్య పరిరక్షణ అవార్డును ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి డా వి.శేఖర్ నీలకంఠను తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్ హైస్కూల్ లో శాలువాతో సత్కరించి " జీవ వైవిధ్యతను కాపాడుకోవాలని, సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను పిల్లలకు నేర్పాలని చాలా ఏళ్లుగా పని చేస్తున్న నీలకంఠ కు ఈ అవార్డు రావడం సంతోషమని ఆయన తెలిపారు. సమగ్ర శిక్ష అధికారులు సురేష్, రామ చంద్రారెడ్డి, డిసిఈబి ఛైర్మన్ వంశీ రాజు, హరిశంకర్, నెమిలేటి కిట్టన్న, యువశ్రీ మురళి, రాజు, వెంకటేష్, గోవిందయ్య పాల్గొన్నారు.

సంజీవరెడ్డి సేవలు చిరస్మరణీయం



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ స్థాపనలో, అభివద్ధిలో స్వర్గీయ నీలం సంజీవరెడ్డి పాత్ర మరువలేనిదని ఉపకులపతి ఆచార్య కె.రాజారెడ్డి అన్నారు. మాజీ రాష్ట్రపతి, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన నీలం సంజీవ రెడ్డి 110వ జయంతి పురస్కరించుకొని ఉన్నతాధికారులు శుక్రవారం వర్సిటీ లోని నీలం సంజీవ రెడ్డి విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, డీన్ ఆచార్య దామోదర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఆర్ట్స్ కాలేజ్, ఆచార్య పద్మనాభం, ప్రిన్సిపాల్ సైన్స్ కాలేజ్ ఆచార్య తులసీ రామకష్ణారెడ్డి ,ఇతర ఆచార్యులు ,ఫైనాన్స్ ఆఫీసర్, ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ సిబ్బంది , నాన్ టీచింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ,సెక్రటరీలు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రెసిడెంట్ మురళీరెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

నీలం సంజీవరెడ్డిది విలువలతో కూడిన రాజకీయం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: అవినీతి రాజ్యమేలుతున్న ఆధునిక యుగంలో డాక్టర్ నీలం సంజీవరెడ్డి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర మంత్రిగా, ఆంధ్ర రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రథమ ముఖ్యమంత్రిగా, లోక్ సభ స్పీకరుగా, కేంద్ర మంత్రిగా, ఆరవ భారత రాష్ట్రపతిగా ఆయన పాటించిన నైతిక ప్రమాణాలను, సాధించిన అభివద్ధిని, ప్రదర్శించిన నిరాడంబరతను గుర్తు చేసుకోవడం నేటి తరానికి అవసరం ఎంతైనా ఉందని, ఆంధ్రప్రదేశ్ పూర్వ ఉపసభాపతి, పూర్వ మంత్రివర్యులు డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమీ (అగ్రశ్రీ) నెలకొల్పిన డాక్టర్ నీలం సంజీవరెడ్డి స్మారకోపన్యాస కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడారు. విలువలతో కూడిన రాజకీయ వ్యవస్థను డాక్టర్ సంజీవరెడ్డి ఆచరించారని తెలిపారు. ఈ సందర్భంగా భారత గ్రామీణ అధ్యయనం మరియు పరిశోధనా అకాడమీ పురస్కారాన్ని డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్ కు బహుకరించారు. అలాగే డాక్టర్ నీలం సంజీవరెడ్డి న్యాయ శిరోమణి రాష్ట్ర పురస్కారాన్ని



ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ జి ఎతిరాజులుకు, విద్యా శిరోమణి పురస్కారాన్ని అన్నమాచార్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ చొప్ప గంగిరెడ్డికి, వైద్య శిరోమణి పురస్కారాన్ని స్విమ్స్ కార్డియాలజీ సీనియర్ ఆచార్యులు డాక్టర్ డి రాజశేఖర్ కు, పంచాయితీ రాజ్ శిరోమణి పురస్కారాన్ని పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీ అధికారి శ్రీ జీవీకే మల్లికార్జున రావులకు బహుకరించారు. వ్యవస్థాపక సంచాలకుడు అగ్రశ్రీ డాక్టర్ డి సుందరరామ్, వ్యవస్థాపకురాలు భారతి సుందర్, సహాయ సంచాలకుడు డి సాయి కుమార్, ఆకాశవాణి విశ్రాంత సంచాలకుడు ఏ. మల్లేశ్వరరావు, వివిధ కళాశాలల అధ్యాపక బందం, విద్యార్థులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నిధులకు ఈకేవైసీ తప్పనిసరి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: ప్రధానమంత్రి కిసాన్ నిధి పథకం కింద ఏడాదికి 6 వేలు కేంద్ర ప్రభుత్వం రైతు ఖాతాలో జమ చేయడానికి అర్హత గల ప్రతి రైతు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఖాదర్ బాషా తెలిపారు. మండలంలో ఈకేవైసీ చేసుకోని రైతులు 1090 మంది ఉన్నారని.. రైతులు తప్పనిసరిగా మే 31వ తేదీలోపు రైతు భరోసా కేంద్రాల్లో ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు. జూన్ నెలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రైతు భరోసా నగదు కావాలంటే బ్యాంకుకు ఆధార్ లింక్ కచ్చితంగా ఉండాలని తెలిపారు.

టైంస్కేల్ ఉద్యోగులను క్రమబద్ధీకరించండి




ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి విశ్వ విద్యాలయాలలో పనిచేస్తున్నటువంటి టైం స్కేల్, ఎన్ఎమ్ఆర్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వైయస్సార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నేతలు సజ్జల రామకష్ణారెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కే. మురళి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి విశ్వ విద్యాలయాలలో 25 సంవత్సరాలకు పైగా టైం స్కేల్ ఉద్యోగులుగా పని చేస్తున్న వారికి రెగ్యులరైజేషన్ చేయాలని ప్రభుత్వానికి విన్నవించడం జరిగిందన్నారు. విద్యాలయాలలోని సేవలు అందిస్తున్న టైం స్కేల్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. దీర్ఘకాలంగా విశ్వవిద్యాలయాల్లో తమ సేవలను వినియోగించుకుంటూ తమకు ఉద్యోగ భద్రత కల్పించడంఉన్నతాధికారులు, ప్రభుత్వానికి ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికే ప్రభుత్వ ప్రాధాన్యత




ప్రజాశక్తి-తిరుపతి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోం దని ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరావు ఆధర్వంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. రైతు భరోసా కేంద్రాలు, రైతులకు వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు, రాయితీ పై రైతు భరోసా కేంద్రాలతో విత్తనాల సరఫరా, ప్రకతి వ్యవసాయం, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్లు తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా సిరికల్చర్ అధికారి గీతారాణి, మత్స్యశాఖ అధికారి శ్రీనివాస నాయక్, మైక్రో ఇరిగేషన్ శాఖ అధికారి సతీష్, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన మండలి సీనియర్ సైంటిస్ట్ సునీత, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యకాసం ధర్నాను విజయవంతం చేయండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ఉపాధి హామీ పథకాన్ని కాపాడు కోవడమే లక్ష్యంగా శనివారం స్థానిక ఆర్డిఓ కార్యాలయం వద్ద తలపెట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే యోచనలో ఉందని విమర్శించారు. ఉపాధి నిధులను దారి మళ్లించి సంక్షేమ పథకాలకు వాడుకుంటుందని ఆరోపించారు. కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదని, కనీసం సమ్మర్ అలవెన్స్ లు కూడా అందించడం లేదని వాపోయారు. మోడీ పాలనలో ఉపాధి హామీ చట్టం ప్రమాదంలో పడిందని, దానికాపాడుకోవాలంటే వ్యవసాయ కార్మికులు నడుం కట్టాలని పిలుపునిచ్చారు.

వాలంటీర్లు ప్రజా సేవకులు



ప్రజాశక్తి-గూడూరు టౌన్: వాలంటీర్లు ప్రజా సేవకులని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం గూడూరు రెండో పట్టణ పరిధిలోని మాలవ్యనగర్ సచివాలయంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి పాల్గొని వాలంటీర్లను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సీఎం జగన్మోహన్‌రెడ్డి 50 గహాలకు ఓ వాలంటీర్‌ను నియమించారని తెలిపారు. అతి తక్కువ వేతనంతో వాలంటీర్లు ఉత్తమ సేవలు ప్రజలకు అందిస్తున్నారని, ఎక్కడికి వెళ్లినా వాలంటీరు ప్రవర్తనపై ప్రజలు సంతప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో అర్హులైన పేదలకు ఇవ్వకుండా మోసం చేశారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా వాలంటీర్లు ఎంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఉత్తమ సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పురపాలక కమిషనర్ సాయి నాథ్ , నాయకులు రాజేష్ , సుభాన్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి అభివృద్ధి నా బాధ్యత : నాని



ప్రజాశక్తి -తిరుపతి అర్బన్: చంద్రగిరి నియోజకవర్గ దశ దిశను మార్చే బాధ్యత తనదని చిత్తూరు జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ పులివర్తి నాని అన్నారు. రాబోయే ఎన్నికల్లో నిండు మనసుతో ఆశీర్వాదించాలని కోరారు. పేరూరు పంచాయతీలో చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్, చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు పులివర్తి నాని చేపట్టిన "మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని" 29వ రోజు కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా ప్రజలు పులివర్తి నానికి బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. పులివర్తి నాని సమస్యలు సేకరిస్తూ భరోసా కల్పిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు పసుపులేటి రాజా, జనరల్ సెక్రెటరీ వెంకటేష్, నటరాజ, లక్ష్మి ప్రసన్న, ముని హేమంత్ రెడ్డి, వేణు గోపాల్ నాయుడు, రంగనాథ్, అనిల్ కుమార్ రాయల్, ముంతాజ్, మహేష్, డామినేటి నాగరాజు, మురళి తదితరులు పాల్గొన్నారు.

సీవోసీ ఫౌండేషన్ పనుల పరిశీలన



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పాత భవనాన్ని తొలగించి అదే ప్రాంతంలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ ఫౌండేషన్ పనులను తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఐఏఎస్ శుక్రవారం పరిశీలించారు. ఇంజినీరింగ్, ఏయికామ్ ప్రతినిధులతో కమిషనర్ హరిత మాట్లాడుతూ సీవోసీ భవనం పూర్తైతే తిరుపతి నగరపాలక సంస్థ ఆధునిక వసతులతో ప్రజలకు అందుబాటులోకి వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకొని ..పనులు ఆలస్యం కాకుండా వేగవంతం చేయాలన్నారు. రూ.80 కోట్లతో నిర్మిస్తున్న ఈ భవనం ఆలస్యం కాకుండా సకాలంలో నిర్మాణాలను పూర్తి చేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, డీఈ దేవిక, ఏయికామ్ ప్రతినిధి బాలాజీ, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

15 ఏళ్లు దాటిన వాహనాలకు రెన్యువల్ లేదు



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 15 సంవత్సరాలు దాటిన అన్ని రకాల ప్రభుత్వ వాహనాలకు రెన్యువల్ నిలుపుదల జరిగిందని.. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం స్క్రాప్ పాలసీతో సంస్థను నియమించనుందని జిల్లా రోడ్డు భద్రతా కమిటీ కన్వీనర్, జిల్లా రవాణా అధికారి సీతారామిరెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం జరిగింది. జిల్లా రవాణా అధికారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గతంలో మాదిరిగా కాలం చెల్లిన వాహనాలకు వేలం వేయడం చేయరాదని.. రాష్ట్ర ప్రభుత్వం స్క్రాప్ పాలసీ ఇవ్వనుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రమాదాల బారిన పడిన వారికి తక్షణ సహాయం అందించి ఆసుపత్రిలో చేర్పించిన వారికి ప్రాణాలు కాపాడినందుకు రూ.5 వేలు పారితోషకం అందించనుందని.. ప్రతిఒక్కరూ బాధ్యతతో ప్రమాదాల బారిన పడిన వారిని కాపాడాలని కోరారు. అలాగే ఐ-రాడ్ యాప్‌లో ప్రమాదాలను పోలీసు శాఖ వారు నమోదు చేస్తున్నారని.. వైద్య శాఖ చేయడం లేదని ఈ యాప్ ఉపయోగం కేంద్ర ప్రభుత్వం ప్రమాదాల నివారణకు సమీక్షించి పలు సూచనలు చేయడానికేనని తెలిపారు. ట్రాఫిక్ డి.ఎస్.పి నరసప్ప మాట్లాడుతూ ట్రై జంక్షన్లు సి.మల్లవరం, గాజులమండ్యం వద్ద పనులు వేగవంతం చేసి ప్రమాదాల నివారణకు చెన్నై హై వే అథారిటీ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా ప్రజా రవాణాధికారి చెంగల్ రెడ్డి మాట్లాడుతూ ఆర్.టి.సి. ఆధ్వర్యంలో ప్రతి నియోజకవర్గంలో హెవీ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేసి ఇప్పటికే 500 మందికిపైగా శిక్షణ ఇచ్చామని, ఆర్.టి.సి. డ్రైవర్లకు ప్రమాదాల నివారణకై తరచూ అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్.ఈ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కార్పోరేషన్ ఎస్.ఈ. మోహన్, స్వర్ణ టోల్ ప్లాజా హరి, రేణిగుంట-నాయుడుపేట మెగా ఇంజనీరింగ్ విజయ్ రాథోడ్, ఐ- రాడ్ ప్రాజెక్టు మేనేజర్ రత్న ప్రకాష్, రవాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

తుమ్మలగుంట మైదానంలో క్రీడాకారుల సందడి



ప్రజాశక్తి-క్యాంపస్: చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడమే ధ్యేయంగా నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నిర్వహించే వైఎస్ఆర్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌లో గ్రామీణ క్రీడాకారులు, లోకల్ బాయ్స్ సిక్సర్ల మోత మోగిస్తున్నారు. నియోజక వర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో తుమ్మలగుంట వేదికగా జరుగుతున్న వైఎస్ఆర్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్ కు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. బంతులను బౌండరీలు దాటిస్తూ బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నారు. చూడడానికి పల్లెటూరి కుర్రాళ్లు.. అయినా చిచ్చర పిడుగులమని నిరూపించారు. బ్యాట్ చేతబట్టి మైదానంలోకి దిగిన యువకులు పరుగుల వర్షం కురిపిస్తూ స్కోర్ బోర్డును అమాంతం పెంచేశారు. బౌలర్లు వరుస వికెట్లు తీస్తూ మ్యాచ్ లను ఉత్కంఠతకు మళ్లించారు. ఆరవ రోజు శుక్రవారం జరిగిన క్రికెట్ టోర్నమెంట్ లో ఎలాంటి సమస్యలకు తావు లేకుండా నిర్వాహకులు విజయవంతం చేశారు. ముందుగా నిర్ణయించిన సమయానికి క్రీడాకారులు మైదానానికి చేరుకుని తమకు కేటాయించిన గ్రౌండ్లలో పోటీకి సిద్ధమవుతున్నారు. ఇరు జట్లు పోటీకి సిద్ధమవగానే చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిలు ప్రతి క్రీడాకారున్ని పరిచయం చేసుకుని కిట్లు పంపిణీ చేస్తున్నారు. అనంతరం టాస్ వేసి ఆటను ప్రారంభం చేస్తారు.

నేరాలు - ఘోరాలు

గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకుని మృతి

ప్రజాశక్తి-పాకాల: గుర్తుతెలియని వ్యక్తి వేప చెట్టుకు ఉరి వేసుకొని మతిచెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. పాకాల పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని గాదంకి పంచాయతీ ఇరుగు రంగయ్యగారిపల్లికి వెళ్లే రహదారి సమీపంలోని రైతు భాస్కర్ పొలంలోని వేప చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని మతి చెందిన సంఘటన గురువారం రాత్రి వెలుగులోకి వచ్చింది. మతిచెందిన వ్యక్తి వయసు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉంటుంది. సీఐ రాజశేఖర్ సంఘటనా స్థలానికి వెళ్లి సిబ్బందితో మతదేహాన్ని పరిశీలించి విచారించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు పూరిళ్లు దగ్ధం




ప్రజాశక్తి-యర్రావారిపాలెం: మండలంలోని చింతగుంట గ్రామ పంచాయతీ చిన్నబయలు పచ్చారవాండ్లపల్లి సమీపంలోని గిరిజన కాలనీలో శుక్రవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో అంజి, చౌడమ్మ, నాగరాజు, పొన్నాటి నాగరాజలకు చెందిన నాలుగు పూరిళ్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మధ్యాహ్నం ఇళ్లు కాలిన సమయంలో బాధితులు ఇంట్లో లేకుండా కూలీ పనులకు వెళ్లడంతో ప్రాణ నష్టం జరగలేదు. ఇంట్లో దుస్తులు, వంటసామాగ్రి, నగదు, టీవీలు, విలువైన వస్తువులు పూర్తిగా కాలిపోవడంతో నిరాశ్రయులయ్యారు. బాధితులకు తహశీల్దారు దస్తగిరయ్య ప్రభుత్వం తరపున 25 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, చింతగుంట సర్పంచ్ నిత్యావసర వస్తువులతో పాటు ఇంటికి రూ.3 వేలు చొప్పున అందించారు. అధికారులు బాధితులను పరామర్శించారు.

నిరాశ్రయులకు చేయూత

మండలంలోని చింతకుంట గ్రామపంచాయతీ చిన్నభయలు పచారవాండ్లపల్లి సమీపంలో ఉన్న ఎస్టీ కాలనీలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగిండ్లు పూర్తిగా కాలిపోయాయి. బాధితులకు చింతగుంట పంచాయతీకి చెందిన వైసిపి నాయకులు కిషోర్, బాలాజీ, చెన్నయ్య, నంద, గుణశేఖర్ అవసరమైన 25 కేజీలు బియ్యం, పప్పు, నూనె, కూరగాయలు మొదలైన నిత్యావసర వస్తువులను అందించి పరామర్శించి భరోసా ఇచ్చారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న స్కూటర్




ప్రజాశక్తి-తిరుపతి అర్బన్: తిరుపతి రూరల్ చంద్రగిరి రోడ్డులోని కాలూరు క్రాస్ సమీపంలో తిరుపతి నుంచి పీలేరు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ట్రైల్ రన్ నిర్వహిస్తున్న స్కూటర్ మెకానిక్ అదుపుతప్పి ఢీకొన్నాడు. ప్రమాదంలో గాయపడిన అతడిని 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారించారు.

విద్యార్థులకు సన్మానం



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం ప్రజాప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో పదో తరగతిలో మొదటి, ద్వితీయ, తతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను సన్మానించారు. ట్రస్ట్ ఛైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ పదో తరగతిలో మాదిరిగానే బాగా చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. మండల స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన చలపతి(557) చల్లమాంబాపురం, జయ కష్ణ(557) నెలవాయి ఉన్నత పాఠశాలల నుంచి ప్రథమస్థానంలో నిలిచారు. జాహ్నవి (534), ఆకాష్ (525) బి.ఎన్.కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 2, 3 ర్యాంకులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రగతి ట్రస్ట్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, రాజశేఖర్, పురుషోత్తం, ఎస్వి సుస్మిత, కుమారి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యాచవరంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



ప్రజాశక్తి-బాలాయపల్లి: మండలంలోని యాచవరం గ్రామంలో శుక్రవారం జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త, జిల్లా పార్టీ అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కు మార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చెంచోబులు మాట్లాడుతూ మాజీ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్ రెడ్డి చేసిన పనులే నేటికీ బాలాయపల్లి మండలంలో కనిపిస్తున్నాయని చెప్పారు. పేద ప్రజలు అనేక సమస్యలతో అల్లాడుతున్నారయ్యా.. రాత్రి అయితే దోమలు, చినుకు పడితే కంపు భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో ఎంపీపీ భాస్కర్ రెడ్డి, జిల్లా పార్టీ ప్రచార కమిటీ అధ్యక్షుడు నెమళ్ళపూడి సురేష్ రెడ్డి, మహిళ నాయకురాలు రాయి దేవిక చౌదరి, జయంపు సహకార సంఘం అధ్యక్షుడు వెందోటి, కార్తీక్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాయి రమేష్ చౌదరి, మండల వ్యవసాయ కమిటీ అధ్యక్షుడు మల్లీమాల,గోపికష్ణారెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ వెంకట బంగారు ప్రసాద్ చౌదరి, మండల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి యోగా శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో యోగాభ్యాస శిక్షణ శిబిరం ఈనెల 29 నుంచి ప్రారంభమై జూన్ 17 వరకు 20 రోజులపాటు జరగనుందని, ఆసక్తి కలవారు 12 సంవత్సరాల పైన వారు ఎవరైనా ఈ వేసవి యోగా శిక్షణ శిబిరంలో పాల్గొనవచ్చని పిఆర్‌ఓ డాక్టర్ బ్రహ్మాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు రూ.200 ఫీజు కట్టి శిక్షణ పొందవచ్చన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి 8 గంటల వరకు శిక్షణ శిబిరం ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు 92472 10327, 9110503203 నెంబర్లను సంప్రదించాలని కోరారు.